# ది హాస్టల్స్!

పేపరు చదివి కెవ్వున కేకేసింది భార్గవి ఏమయింది? అంటూ పరుగెత్తుకొచ్చాడు శ్రీరాం పళ్ల బ్రష్ చేసుకుంటూ టూత్ బ్రష్‌తో సహా.

పేపర్ చూడండి మైగాడ్ అంది వొణుకుతూన్న కంఠంతో భార్గవి. అర్థరాత్రి హాస్టల్లో హత్యాయత్నం హెడ్ లైన్ మాత్రం చదివి ఉండు నోరు కడుక్కొ వస్తాను అంటూ బేసిన్ దగ్గరికి వెళ్ళాడు.

"ఏమండీ! హాస్టల్లో మనమ్మాయి ఎలా వుందో ఏమిటో? నాకు భయంగా వుంది. సుచిని ఒచ్చేయమని రాయండి" కంగారుగా అంది భార్గవి.

"ఏం ఫరవాలేదు. కంగారు పడకు. నేను ఫోన్ చేసి కనుక్కుంటాలే" అని ఓదార్చడానికి ప్రయత్నం చేస్తున్నా లోలోపల శ్రీరాంకి కూడా కంగారుగానూ భయంగానే వుంది.

ఒకప్పుడు ఆడపిల్లని గడప దాటనీయకుండా పెంచేవారు. చిన్నప్పుడు తల్లిదండ్రులదగ్గరా, మధ్యలో భర్త దగ్గరా, ఆ తరవాత పిల్లలదగ్గరా ఆమెకు రక్షణ వుండేది. ఇప్పుడు కాలం మారి స్త్రీ కూడా విద్యావంతురాలై, ఉద్యోగస్తురాలై వుంటేనే తప్ప వివాహాలు జరగడం లేదు. అంతే కాదు స్త్రీలలోనూ విద్యావంతుల మవాలనే కోరికా, స్వతంత్రంగా తన కాళ్ళ మీద తాము నిలబడాలనే కాంక్ష పెరిగి మామూలు డిగ్రీలే కాక ప్రతీ సాంకేతిక విద్యలోనూ కూడా అర్హతలు సంపాదించుకుంటున్నారు. విజయాలు సాధిస్తున్నారు. అందుకు తల్లిదండ్రులు అదివరకటిలా కాక ఆడపిల్లల్ని కూడా మగ పిల్లలతో సమానంగా చదివిస్తున్నారు. చురుకైన పిల్లలూ అభిలాష కలిగిన వారూ అయితే, పైగా ఇంజనీరింగ్, మెడిసన్ అలాంటి సబ్జెక్టులయితే పై వూళ్ళలో హాస్టల్లో వుండైనా చదువుకుంటున్నారు.

ఆడపిల్లల్ని హాస్టల్లో వుంచి చదివించే తల్లిదండ్రుల బెంగ ఇంతా అంతా కాదు. చురుకుగా చదువుకునే పిల్లల్ని చదువొద్దనలేరు. ఊరు కాని ఊరిలో

వుంచి చదివించలేరు. అడకత్తెరలో పోకలాగా వుంటుంది వీళ్ళ పని. అయినా, నేనాఫీసుకు వెళ్ళగానే ఫోను చేసి కనుక్కుంటానని చెప్పాగా! డోంట్ వర్రీ!... లే! లేచి నాకొక కప్పు టీ చేసి తీసుకురా వేడిగా!" అన్నాడు భార్య మూడ్‌ని మారుస్తూ. భార్గవి లేచి వంటింట్లో కెళ్ళింది. ఎంతకాదన్నా ఆమె ఆలోచనలు హాస్టళ్ళ మీంచి మళ్ళడం లేదు.

సుచి ప్రతి ఉత్తరంలోనూ రాస్తుంది. మమ్మీ హాస్టల్లో భోజనం ఏమీ బాగుండదు. రుచీపచీ లేని ఈ భోజనం చెయ్యలేకపోతున్నాం. ఉదయం బ్రేక్‌ఫాస్టైనా బాగుంటే పోనీ అది తినేసి ఉండొచ్చు. కానీ అదీ బాగుండదు. ఇంటినుంచి జంతికలో, చెగోడీలో ఏవో అలాంటివి చేసి పంపు మమ్మీ. రోజూ హోటల్ కెళ్ళి తినాలంటే డబ్బూ సరిపోదు, టైము వుండదు అని.

అలా ఉత్తరం వొచ్చినప్పుడల్లా భార్గవి కడుపులోని నరాలు పిండేసినట్టుంటుంది. తను అడిగిన వాటికన్నా కొన్ని ఎక్కువే చేసి పంపిస్తుంది. కానీ అది చిరుతిండే అవుతుంది. కాని తిండెలా అవుతుంది? అసలు హాస్టళ్లలో ఇల్లు విడిచి చదువుకోవడానికి వొచ్చిన పిల్లలకి ఆరోగ్యకరమైన రుచికరమైన భోజన సదుపాయాలు కలిగించడం యాజమాన్యాలు కనీస ధర్మం కాదా? దానికి మించినది హాస్టల్లో ఆశ్రయం పొందుతూన్న వారికి ఏ ఆపద కలిగినా గబుక్కున పిలిస్తే పలకడానికి తగినంత కాపలా లేదా సిబ్బందిని రాత్రి పగలూ డ్యూటీలో నియమించవలసిన బాధ్యత వారికి లేదా? లేకపోతే అర్థరాత్రి నిద్దరపోతున్న పిల్ల గదిలోకి అనామకులెవరో కిటికీలోంచి దూకి హత్యా ప్రయత్నం చెయ్యడమేమిటి. ఆ పిల్ల లబోదిబోమని మొత్తుకుంటున్నా ఎవరూ రాకపోవడమేమిటి? అర్థరాత్రి ఆ కేకలు విని తోటి ఆడపిల్లలు భయపడి తలుపులు తీసి బయటికి రాకపోవచ్చు. కాని తగినంత మంది రక్షణ సిబ్బంది కనీసం కారిడార్‌కి ఇద్దరు చొప్పునన్నా ఉండడం అవసరం కాదా? ఇంత నిర్లక్ష్యంగా హాస్టళ్లని నడపడాన్ని గురించి ఎవరూ పట్టించుకోరేమిటి? ఒక వేళ ఆ పిల్ల ప్రాణం పోయినా మానం పోయినా ధన రూపేణా కన్నవారి మొహం మీద కాంపెన్‌సేషన్ అంటూ నాలుగు డబ్బులు పడేయ్యొచ్చు. కానీ పోయిన బిడ్డనిగానీ లేదా బతికుండి పోగొట్టుకున్న ఆమె శీలాన్ని కాని తెచ్చిపెట్ట లేరు

కదా ఆలోచనలు మొదడు చుట్టూ ముసురుకుని భార్గవిని పిచ్చిదాన్ని చేస్తూవుంటే అతి కష్టంమీద కాఫీ కలిపి శ్రీరాంకిచ్చింది.

అతనూ గబగబా కాఫీ తాగేసి వెళ్ళిపోయాడు. ఆ సాయంత్రం శ్రీరాం ఎప్పుడింటికొస్తాడా అని ఎదురు చూస్తున్న భార్గవికి చిరునవ్వుతో స్కూటరు దిగుతున్న శ్రీరాం కనిపించే సరికి ప్రాణం లేచొచ్చింది.

"ఏమయిందీ సుచీతో మాట్లాడారా? కులాసాగా వుందా? ఒచ్చేయమని చెప్పకపోయారా? వెధవ చదువు పోతేపోయింది." అంది పట్టలేని ఆవేశంతో. "స్టాప్... స్టాప్... స్టాప్. సుచితో మాట్లాడాను. కులాసాగా వుంది. ఏం ఫరవాలేదు. పిల్లలందరూ కలిసి ప్రిన్సిపాల్ గది ముందు ప్రభుత్వ కార్యాలయాల ముందు ధర్నా జరిపారట. ఇక ముందు ఇటువంటి పొరపాట్లు జరగవనీ అన్ని విషయాలలోనూ గట్టి బందోబస్తు చేస్తామనీ హామీ ఇచ్చారట. నిన్ను బెంగ పెట్టుకోవద్దని చెప్పింది. ఒకవేళ ఇక్కడ వుండలేని పరిస్థితి వొస్తే అమ్మతో చెప్పండి ఒచ్చేస్తానని మమ్మీకి అసలే ఖంగారు. నేను బాగానే వున్నాను. ఏమీ భయంలేదు డాడీ అని చెప్పింది" అన్నాడు. ఆ మాటలు విన్నాక భార్గవి మనసు కుదుటపడింది! అయినా ఏదో భయం ఏదో సందేహం ఆమెని వేధిస్తూనే ఉంది.

"ఏమండీ నిజంగా ఇక మీదట హాస్టళ్లలో మంచి సదుపాయాలు కలిగించి రక్షణను కల్పించి జాగ్రత్తగా చూసుకుంటారా? ఏదో మామూలుగా వాగ్దానం చేసి మర్చిపోతారా?" సందేహంగా అడిగింది.

"తప్పకుండా చేస్తారు. పిల్లలందరూ ఈ విషయాన్ని గురించి తీవ్రంగా చర్చించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించుకున్నారుగా జరిగి తీరుతుంది. డోంట్ వర్రీ అసలు ఇంకో సంగతి భార్గవి.

పిల్లలు కూడా ఇలా గొడవేదో జరిగాక మాకదిలేదు ఇదిలేదు అని గోల చేసే బదులు ముందే వారి వారి అవసరాలేమిటో వాళ్ళలో వాళ్లు చర్చించుకుని వాళ్ళ వార్డెన్‌తోనో, కాలేజి ప్రిన్సిపాల్‌తోనో ఆలోచించి అవి అమలు జరిగేలా చూసుకోవడం నేర్చుకోవాలి. ప్రతీదీ ఎవరో మనకి చేసి పెట్టాలని తయారుగా

వున్న వడ్డించిన విస్తరి గురించి ఆలోచించకూడదు. ఒకవేళ వడ్డించిన విస్తరే దొరికితే సమస్యేలేదు. లేనప్పుడు మనకి మనం అడిగి ఏర్పాట్లు చేసుకోవడంలో తప్పులేదుగా" అన్నాడు శ్రీరాం.

"నిజమేననుకోండి పిల్లలు ఎంత అని ఆలోచిస్తారు. ఒక పక్క చదువు మరో పక్క ఇల్లొదిలి వచ్చిన బెంగా ఇవి కాక.."

ఏదో చెప్పబోతున్న ఆమె మాటలకడ్డొచ్చి "ఏమీ లేదు పిల్లల శక్తి సామర్థ్యాలని తక్కువ అంచనా వేస్తున్నాం. హాస్టల్ లో భోజనాల విషయంలో కూడా ఒక్కొక్క వారం ఒక్కొక్క గ్రూపు పిల్లలు దగ్గరుండి భోజనం ఏర్పాట్లు చేసుకుంటే బాగుంటుంది. ( ) అలా ఒకరికొకరు సహకరించుకుని సంప్రదించుకుంటే వాళ్ళలో వాళ్లు ఎన్నో సమస్యలని పరిష్కరించుకోవచ్చు అవునా" భార్గవి బుగ్గమీద చిటికవేస్తూ అన్నాడు శ్రీరాం.

"సర్లెండి మీ అభిప్రాయాలు బాగానే వున్నాయి. ముందు సుచి ఇంకా ఏమందో చెప్పండి" అంది భార్గవి.

"మమ్మీకి చెప్పండి అనవసరమైన భయాలు పోగొట్టుకోమని, ధయిర్యంగా వుండమనీ" అంది.

"ఊ సర్లే ఎప్పుడొస్తుందట"

"అది చెప్పలేదు కాని మమ్మీని నా తరపున ముద్దెట్టుకోండి అంది" అంటూ దగ్గరగా వస్తున్న శ్రీరాంని నవ్వుతూ దూరంగా తోసింది భార్గవి గుండెలోని గుబులు మాయంకాగా!

★